
కథ

# నిక్షేపం



భమిడిపాటి జగన్నాథరావు

పదేళ్ల తర్వాత రమణను కలుసుకోబోతున్నానన్న ఆలోచన నాలో సంతోషం నింపుతోంది. రమణ, నేను కలిసి చదువుకున్నాం...స్కూలు చదువునుండి కాలేజీ వరకూ. ఇంటర్ తర్వాత అతను మెడిసన్‌లో చేరాడు. నేను ఎమ్మెస్సీ చేసి ఓ ప్రైవేటు కాలేజీలో అధ్యాపకునిగా ఒకే ఊర్లో స్థిరపడిపోయాను.

స్కూలు రోజులనుండీ రమణ మిత్రులతో కలివిడిగా మెలిగేవాడు. కవితలు రాసేవాడు. చిన్న నాటికలు రాయడమే కాక మంచి రచయితల నాటికలలో వేస్తూ, నిర్దేశకత్వం నడిపేవాడు. అందరితో ఆప్యాయతతో, కలుపుగోలుగా కలిసిపోయేవాడు. ఇక చదువులో ఎప్పుడూ మొదటివాడే. తెలివైనవాడినన్న గర్వం ఉండేది కాదు. మొత్తంమీద అతను విశిష్టమైన కుర్రవాడు. అందరూ అతన్ని తమకు దగ్గరగా తీసుకునేవారు. రమణ అంటే నాకు ఆరాధన భావంతో కూడిన గౌరవం. అతను నాకు సహాధ్యాయి, దగ్గర మిత్రుడూ అయినందుకు నాకు చాలా తృప్తిగా ఉండేది.

మా వృత్తులవల్ల మేము వేరేవేరే ఊళ్లలో స్థిరపడినా, ఎక్కడో అక్కడ ఏ రెండు మూడేళ్లకో కలిసేవాళ్లం. హాయిగా, ఆనందంగా కబుర్లు చెప్పుకునే వాళ్లం. మా మధ్య ఉత్తరాలు రాసుకోవడం చాలా తక్కువ.

ఆఖరిసారి తొమ్మిదేళ్ల క్రితం రమణ ఉన్న ఊరు ఓ పనిమీద వచ్చాను. అతనిని కలిశాను. తన రెండు గదుల ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. తన స్కూటరుమీద తన క్లినిక్‌కు తీసుకువెళ్లాడు. 'నీ దగ్గరకు వచ్చే పేషెంట్సుకు ఇబ్బంది...నేను వెళ్లిపోతా' నన్నా, 'వాళ్లను చూస్తూనే మధ్యలో మనం మాట్లాడుకుందాం' అని నన్ను బలవంతం చేసి కూచోబెట్టేశాడు.

అద్దెకు తీసుకున్న ఓ చిన్న డాబా ఇంట్లో అతని క్లినిక్ ఉంది. రోగ నిర్ధారణలో అతనికి ఉన్న ప్రావీణ్యం గురించి అందరూ చెప్పుకుంటారు. ఆరోజు తన దగ్గరగకు రకరకాల అనారోగ్యాలతో వస్తూన్న వారిని క్షుణ్ణంగా పరీక్ష చేస్తూ వైద్యంతోపాటు తన ఆదరణతో వాళ్లల్లో విశ్వాసం కలిగిస్తూ ఉండడం నాకు చాలా తృప్తిగా ఉండి, మా రమణను చూస్తుంటే నా లోపల అంతా గర్వం నిండింది.

మధ్యాహ్నం ఇద్దరం హోటలుకు వెళ్లి కబుర్లు చెప్పుకుంటూ నెమ్మదిగా భోజనం చేశాం. నా రైలు సమయం దగ్గరవుతూంటే, వాడు తన స్కూటరుమీద నన్ను రైలు స్టేషనులో దింపి వీడ్కోలు చెప్పాడు.

మళ్లా ఇప్పుడు రమణ ఉన్న ఊరు వచ్చాను. ఆ రాత్రి రమణ ఇంటికి ఫోను చేశాను. అతను దొరకడమే కష్టమైంది. నలభై నిమిషాల తర్వాత దొరికాడు. నేను తాపీగా మాట్లాడదా మనుకుంటుండగా, 'రేపు ఉదయం తొమ్మిది గంటలకు క్లినిక్ రా' అని పెట్టేశాడు.

వృత్తికి సంబంధించిన ఒత్తిడిలో ఉన్నా డనిపించింది.

మర్రోజు ఉదయం మునుపు డాబా ఇంట్లో ఉన్న అతని క్లినిక్ వెళ్లాను. అతని బోర్డు లేదు. ఇంకెవరో ఉంటున్నట్టు తెలుస్తూనే ఉంది. వాకబు చేసుకుంటూ, వెతుక్కుంటూ వెళ్లాను. ఈసారి పట్టుకోవడం ఏమంత కష్టం కాలేదు. అతని పేరుతో పెద్ద బోర్డు. పెద్ద ఇల్లు. నేను కాస్త ఆశ్చర్యపోతూ లోపలకు వెళ్లాను. విశాలమైన వీధి వరండాలో ఓ వంద చెప్పుల జతలు చిందరవందరగా ఉన్నాయి. అవి దాటుకుంటూ వెళ్తే ఓ పెద్ద హాలులో జనమే జనం. కుర్చీలు సరిపోక సగంమంది నిలుచుని ఆపసోపాలు పడుతున్నారు.

అక్కడ ఓ మూల చిన్న టేబులు దగ్గర ఉన్న అమ్మాయి దగ్గరకు

వెళ్లి నా పేరు చెప్పబోతుంటే, ఆ పిల్ల 'కొత్త కేసా? పాత కేసా?' అనడిగింది.

నాకు మొదలు అర్థం కాలేదు.

ఆ అమ్మాయి కంఠం వీక్‌గా, మనిషి ఎనీమిక్‌గా ఉంది. ఆ పిల్ల మొహంలో అలసట, టెన్షన్, విసుగు కలిసి ఉన్నాయి.

"నేను ఆయన స్నేహితుణ్ణి...కలవడానికి వచ్చాను" అన్నాను.

"అయితే, డాక్టరుగారిని ఇంటిదగ్గర కలవండి. ఇప్పుడు చాలా బిజీగా ఉన్నారు" అని ఇంకో పేరు పిలిచింది.

లోపలకు వెళ్లేవారు వెళ్తున్నారు; వచ్చేవాళ్లు వస్తున్నారు. అప్పటికి నలభై నిమిషా లైంది నేను వచ్చి.

"నిన్న రాత్రి ఫోను చేశాను...ఇక్కడ కలవమన్నారు డాక్టరుగారు" అంటూ నా పేరు చెప్పాను.

ఆ అమ్మాయి ఓ చిన్న నోటుబుక్కు లాటిది చూసి "మీ పేరు నాకు చెప్పలేదండి" అంది. ఇక అదే ఆఖరు అన్నట్టు.

"పోనీ టెలిఫోనులో చెప్పమ్మా" అన్నాను.

"అమ్మో...ఫోను చేస్తే ఊరుకోరండి" అంది.

"లేకపోతే, లోపలికి వెళ్లి చెప్పమ్మా?"

"అలా నేను లోపలకు వెళ్లడం డాక్టరుగారికి ఇష్టం ఉండదండి."

"మరి ఎలా కలవాలి?" అనడిగాను.

"మీ విజిటింగ్ కార్డు ఇవ్వండి...అందరూ అయిపోయాక లోపలకు వెళ్లి ఇస్తాను."

నా పేరు ఓ చిన్న కాగితంమీద రాసిచ్చాను. ఆ పిల్ల యాదాలాపంగా ఆ కాగితం చూసీ చూడనట్టు చూసి, ఓ పక్కన ఉంచింది.

గంటన్నర దాటింది. ఆఖరి జంట లోపలకు వెళ్లారు. వాళ్లూ బయటకు వచ్చారు.

ఆ పిల్ల లోపలకు వెళ్లి వెంటనే బయటకు వచ్చేసింది. "డాక్టరుగారు వెళ్లిపోయారండి" అంది.

"బయటకు రాలేదే?!" అని ప్రశ్నించాను.

"వెనక డోర్‌నుండి వెళ్లిపోయారండి. సాయంత్రం నాలు గ్గంటలకు వస్తే రండి" అని ఆ పిల్ల తన చిన్న పర్స్ తీసుకుని వెళ్లిపోతూ, "ఇక ఆ తలుపులు వేసేస్తారండి... మీరూ వచ్చేయండి" అని తూనీగలాగ వెళ్లిపోయింది.

నేను నీరసంగా బయటకు వస్తూ, సైకిలు ఎక్కుతూన్న ఆ పిల్లని ఆపి, "ఈ ఇల్లు డాక్టరుగారిదేనా?" అనడిగాను.

"అవును, సర్" అంటూ వెళ్లిపోయింది.

ఆ పక్కనే ఓ మందుల షాపుంది. అక్కడ ఓ తలనొప్పి మాత్ర తీసుకుని వేసుకున్నాను.

అక్కడ ఉన్న ఓ స్టూలుమీద కూచుని, "ఈ ఇల్లు మా రమణే కట్టించాడా?" అనడిగాను, ఆ షాపులో ఉన్న పాతికేళ్ల కుర్రాడితో.

"ఆయ్...డాక్టరు రమణమూర్తి గారిదేనండి. నాలుగు అంతస్థులండి....ఉండేదేమో ముగ్గురేనండి. కాలేజీలో చదూతున్న పిల్లాడు, డాక్టరు గారు, భార్యానండి."

"అలాగా..." అని నేను అంటూండగానే...

"మాంచి రద్దీగా ఉండే సెంటర్‌లో ఇంకో యాపారం కాంప్లెక్సుకూడా సంవత్సరం క్రితం గృహప్రవేశం చేసేరండి."

**మరింత శుభ్రం**

చేతులు మురికైనా, ఏదైనా తిన్నా, సబ్బుతో కడుక్కుంటుంటాం. కానీ ఇప్పుడు న్యూజెర్సీలోని ఒక పరిశోధకకేంద్రం వారు కొత్త రకం సబ్బును తయారు చేశారు. దానితో కడుక్కుంటే, మనం మామూలుగా కడుక్కున్నప్పుడు కళ్లకు కనిపించకుండా వున్న



బాక్టీరియా కూడా పోతుందట. యాభై శాతం బాక్టీరియాను ఈ రకమైన సబ్బుతో పోగొట్టగలిగారట. ప్రోటెక్స్ అనే పేరుతో ఈ సబ్బు అమెరికావాసులకు లభిస్తున్నది.

ఎస్.

"అదికూడా ఎందుకు?" అన్నాను నాలో అనుకున్నట్టు.

"ఆయ్...బలేవోరే. కింద షాపులండి. పైన బ్యాంక్ అండి. ఆపైన కంపూటర్లు, సెల్ ఫోన్లు అమ్మేషాపులకు అద్దె కిచ్చేశారండి. అద్దెలే అద్దెలండి. ముందస్తుగానే బోల్డంత గుడ్‌విల్ తీసుకునే అద్దెల కిచ్చేసేరండి. డబ్బులే డబ్బులండి. నాలుగు ఆస్పత్రుల్లో కన్సల్‌టెంటండి. హస్తవాసి మంచిదని వస్తారు జనం."

నేను అయోమయస్థితి నెమ్మదిగా హోటల్ రూము కొచ్చేశాను.

❊ ❊ ❊

సాయంత్రం నాలుగు గంటలకు పావుగంట ముందే రమణ క్లినిక్ ప్లస్ ఇంటికి వెళ్లాను.

ఆ అమ్మాయి దగ్గరకు వెళ్లాను. ఏమిటి అన్నట్టు చూస్తూ సడెన్‌గా గుర్తు కొచ్చినట్టు ఉదయం నేను ఇచ్చిన నా పేరు ఉన్న కాగితం వెతికిపట్టుకుని భయం భయంగా లోపలకు వెళ్లింది. బయటికొచ్చి, "డాక్టరుగారు రమ్మన్నారండి" అంది.

నేను లోపలకు వెళ్లాను. రమణ నన్ను చూస్తూ కూచోమన్నట్టు సంజ్ఞ చేసి, బెల్ కొట్టాడు. బయట ఉండే ఆ అమ్మాయి లోపలకు వచ్చింది.

"గది మూలలో ఆ బూజు ఏమిటి... తీయించేయాలని తెలీదా? ఈ కాగితాలు సర్దకుండా ఏంచేస్తున్నావ్? సరిగా పనిచెయ్యి. నీ లాటివాళ్లు ఉద్యోగాలకోసం క్యూ కట్టి చాలామంది ఉన్నారు. చకచకా నీట్‌గా, బ్రిస్క్‌గా, స్మార్ట్‌గా పనిచేయాలి. లేకపోతే, ఇంటికి వెళ్లిపో" అంటూ రమణ ఆ అమ్మాయితో తిట్టినట్టుగా మాట్లాడాడు.

ఆ అమ్మాయి చిన్నబుచ్చుకుని, దెబ్బ తిన్న పిట్టలా ముడుచుకుపోయి వెళ్లిపోయింది. రమణ కంఠంలో ధ్వనించిన రూక్షణత్వం నన్ను ఆశ్చర్యచకితుణ్ని చేసింది. నాకు తెలిసి వాడి స్వభావాని కది విరుద్ధం.

బెల్ నొక్కాడు. అరవై ఏళ్లు దాటినాయన వచ్చాడు. జబ్బుగా ఉన్నట్టు నాకే తెలుస్తోంది.

రమణ ఆయన బరువు, బీపీ చూసి, ఆ ముసిలాయన ఇంకా తన రోగం చెబుతూంటే, పుస్తకంలో మందులు రాసేసి పుస్తకం ఆయనకు ఇచ్చేసి బెల్లు కొట్టాడు. వరసగా ఆరుగురు లోపలకు వచ్చి, వెళ్లారు.

అదే రొటీన్. బీపీ, మందులు రాయడం. ...వాళ్లు ఆత్రతతో చెబుతూన్నది వింటున్నట్టుగా అతని మొహంలో జాడలేదు. వాళ్లెవరితోనూ అతను ఒక్కమాట మాట్లాడలేదు. వాళ్లు ఏదో చెప్పబోతూంటే, వాళ్ల పుస్తకం ఇచ్చేస్తూ అక్కడ ఉన్న సిస్టర్‌కేసి చూపించేవాడు. ఆ సిస్టర్ 'నేను చెబుతాను...రండి' అని వాళ్లను తలుపువేపు నడిపిస్తూ నెమ్మదిగా ఏదో చెబుతోంది.

ఆ సిస్టర్‌తో, "ఓ అయిదు నిమిషాలు ఎవరినీ లోపలికి రానివ్వవద్ద"ని చెప్పి, రమణ నాకేసి తిరిగి, "చెప్పు?" అన్నాడు.

నేను ఏంచెప్పాలి?

రమణే, "ఉదయం రాలేదే?" అనడిగాడు.

"వచ్చాను...లోపలికి రావడం కుదరలేదు... బయట ఉన్న పిల్లతో నువ్వు నా పేరు చెప్పి ఉంటే ఉదయమే కలిసేవీలు అయేది."


అన్నాను.

"పోన్లే ఇప్పుడు కలిశావుగా!" అని ఆగి,

## కీళ్లకు తైలం

తైలమంటే తైలమే, మరో అర్థమేమీ లేదు. యుకెలోని పరిశోధకులు ఇప్పుడు మనకు చెబుతున్న సంగతి మన నాయనమ్మలకూ, అమ్మమ్మలకూ ఎప్పుడో తెలిసిందే. అదేమిటంటే, కాడ్ లివర్ ఆయిల్‌తో మోకాళ్లకు రోజూ కాసేపు మర్దన చెయ్యటం. రెండుమూడేళ్ల పాటు పరిశోధనలూ, ప్రయోగాలూ జరిపి వాళ్లు కనుక్కున్న సంగతి ఇది. ఒక టేబుల్ స్పూన్ కాడ్ లివర్ ఆయిల్‌ను రోజూ మోకాళ్లకు రాసుకుని మర్దన చేసుకుంటే, బిగుసుకుపోయిన కండరాలు సడలి, నొప్పులు తగ్గుతాయి. తక్కిన చేపల నుంచి తీసిన నూనెలు కూడా ఇట్లాగే పని చేస్తాయా అనే అంశం మీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి.

ఎన్.



"పనిమీద వచ్చావా?" అన్నాడు.

అవు నన్నాను. నాతో మాట్లాడడానికి అతని దగ్గర మాటలే లేనట్టు ఉన్నాడు. నాకూ ఏం మాట్లాడాలో తెలీడం లేదు.

బెల్లు కొట్టాడు...రోగులు వచ్చి వెళ్తున్నారు. ఓ మనిషి ఉండగానే ఓ పదిహేడేళ్ల కుర్రాడు వచ్చి, "కారు కావాలి...షాపింగ్ చేయాలి" అన్నాడు.

ఆ కుర్రాడు సిల్క్ షర్టు టక్ చేసుకున్నాడు. ఖరీదైన బెల్ట్ ఆ అబ్బాయి వేసుకున్న పాంటుకు మామూలు పాకెట్సు కాక మోకాలి కింద, పైనా చాలా జేబులు ఉన్నాయి. కనపడేట్టుగా మెడలో చిన్న బంగారు గొలుసు. చేతిలో సెల్ ఫోను.

"ఇవాళ డ్రైవరు సెలవులో ఉన్నాడు, బాబీ! రేపు వెళుదువుగానీలే" అని రమణ అంటుండ గానే, ఆ కుర్రాడు చటుక్కున కుర్చీలోంచి లేచి, రివ్వున వెళ్లిపోయాడు.

ఇంతలో సిల్కు లాల్చీ వేసుకున్న ఓ నలభై ఏళ్ల మనిషి లోపలకు వచ్చి. బర్రున కుర్చీ లాక్కుని కూచున్నాడు. నాలుగు వేళ్లకు ఆరు ఉంగరాలు.

బీపీ చూస్తున్న రమణ ఆ పేషెంటుని వదిలేసి, "ఏమైంది?" అనడిగాడు.

ఇప్పటికి రమణ మొహంలో చిరునవ్వు, మాటల్లో మృదుత్వం కనబడ్డాయి.

"ఆ...అయిపోయింది. రొండ్రోజుల్లో ఆ రెండు వేల గజాల జాగా మీకు ఎగ్రిమెంటు రాసిచ్చే ఏర్పాటు సేసేసానండి. డాక్టరుగారు పనా...మరోటా?! ఆడు అమ్మనంటుంటే, ఎక్కడ నొక్కాలో అక్కడ బిగిసేట్టు సేయిం చేసావండి. ఎల్లుండి ఎగ్రిమెంటు సంతకా లండి" అని ఆ మనిషి ఆగాడు.

"థాంక్స్" అన్నాడు రమణ మొహమంతా నవ్వు పులుముకుని.

"ఇంకా నయవండి...మీరు మాకు కావల్సి నోరు. రేత్రికి కబ్బులో డిన్నరు ఉంది. మర్సి పోకండి" అంటూ వెళ్లా డాయన.

కాసేపట్లో కత్తిరించిన జుట్టుతో, బిగువైన పంజాబీ డ్రెస్‌లో ఒకావిడ విసురుగా లోపలకు వచ్చి, "బాబిగాడు ఇవాళే షాపింగ్ చేయాలం టున్నాడు. వాడి సెల్‌ఫోను ఓల్డ్ మోడల్‌ది... కలర్ డిస్‌ప్లేతో లేటెస్ట్ మోడల్ కావాలి వాడికి. ఇంకో జత షూస్ కొనుక్కోవాలట. కారు లేకపోతే ఎలా? ఈ చిన్న కోరిక తీర్చలేకపోతే బాబిగాడు హర్ట్ అవుతాడు" అంది.

రమణ ఓ అర నిమిషం ఆలోచించి, "సరే ...పెద్ద కారు వద్దు. చిన్నది తీసుకెళ్లమను. బాబీని స్పీడుగా నడపొద్దని చెప్పు."

ఆవిడ వెళ్లిపోయింది.

"మా ఆవిడ సుందరి...గుర్తు పట్టావుకదూ" అన్నాడు రమణ నాకేసి తిరిగి.

ఆవిడలో మార్పు వచ్చింది...హెయిర్ స్టయిల్ మారింది. ఒళ్లు పెరిగింది. బట్టలతీరు మారింది.

అయినా, ఆవిడ గుర్తు కొచ్చింది. కాని, రమణ అదే సన్నంతో రివటలా అలాగే ఉన్నాడు. అదే ఒత్తు జుట్టు. రూపంలో ఏమీ మార్పు లేదు. కాని, రమణనే నేను గుర్తు పట్టలేకపోతున్నానని నాకు తెలిసింది.

"వస్తాను" అంటూ లేచాను.

"సరే" అన్నాడు ముక్తసరిగా.

రమణ స్వభావంలో వచ్చిన మార్పులు నాకు జీర్ణమవడానికి కొంత సమయం పట్టింది.

ఈ మార్పు ఎందుకు వచ్చింది అన్న ఆలోచనకు సమాధానం తెలియడానికి నాకు కాస్త ఎక్కువ సమయమే పట్టింది.

రమణ డబ్బు సంపాదనలో పడ్డాడు. సరే...దానితో ఆగలేదు. సంపద పోగేసుకోవడం యావలో రమణకు మనుషులమీద ప్రేమ పోయింది. ఇతరుల జీవితాలపై గౌరవం పోయింది.

ఈ రమణను ఇప్పటికి గుర్తించగలిగాను.

ఈ రమణ....నా రమణ కాడు; మా రమణ కాడు; మన రమణ కాడు.

